క్లుప్తంగా

మిత్రుడి కుటుంబానికి చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

రఘునాథపల్లి : మండలంలోని పడమటిగడ్డకు చెందిన రమాకాంత్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా నిడిగొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1998–99 సంవత్సరంలో రమాకాంత్‌రెడ్డితో పదో తరగతి చదివిన స్నేహితులు బాధిత కుటుంబానికి చేయూత అందించారు. ఆదివారం తోటి విద్యార్థులంతా కలిసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మిత్రులు పాల్గొన్నారు.

పుస్తెమట్టెల అందజేత



పుస్తెమట్టెలు అందజేస్తున్న భూపాల్‌రెడ్డి

బచ్చన్నపేట : మండలంలోని పలు గ్రామాల్లో పేదింటి ఆడపిల్లల వివాహానికి వాస్విక్ ఫౌండేషన్ చైర్మన్ నిడిగొండ నరేష్‌కుమార్, వైస్ చైర్మన్ నూకల భాస్కర్‌రెడ్డి ఆదివారం పుస్తెమట్టెలను పంపిణీ చేశారు. పడమటి కేశ్వాపూర్ గ్రామానికి చెందిన గుండు వినోద–కనకయ్య కూతురు రీచాకు, మండల కేంద్రానికి చెందిన లక్ష్మి–బాల్‌నర్సయ్య కూతురు లక్ష్మికి పుస్తెమట్టెలను ఆ ఫౌండేషన్ సభ్యులు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి, సభ్యులు ఆముదాల భూపాల్‌రెడ్డి, మహేష్, వేణు, నవీన్, చందు పలువురు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గోపీనాథ్ మరణం బాధాకరం

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి టౌన్ : హైదరాబాద్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణం బాధాకరమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. ఆదివారం అమెరికా పర్యటనలో ఉన్న దయాకర్‌రావు గోపినాథ్ మృతికి సంతాపం తెలుపుతు ప్రకటనలో విడుదల చేశారు. గోపినాథ్‌తో తనకు ఉన్న అనుబంధం మర్చిపోలేనిది అన్నారు. టీడీపీ నుంచి ఇప్పటి బీఆర్‌ఎస్ వరకు తనతోకలిసి పని చేశాడని గుర్తు చేశారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా నియోజవకర్గం అభివృద్ధి కృషి చేశాడని తెలిపారు. గోపినాథ్ మరణం బీఆర్‌ఎస్ పార్టీకి తీరనిలోటన్నారు. గోపినాథ్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సన్మానం

కొడకండ్ల : మండల కేంద్రానికి చెందిన గులాం సాధిక్ పదో తరగతిలో టాపర్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా ఆదివారం మండలకేంద్రానికి చెందిన గులాం రసూల్ కుటుంబ సభ్యులు సాధిక్‌ను సన్మానించారు. అనంతరం రూ.28 వేల నగదు అందించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల పునఃప్రతిష్ఠ

పాలకుర్తి టౌన్ : మండలంలోని చెన్నూరులో శ్రీ సీతారామచంద్రస్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఆంజనేయ స్వామి పునఃప్రతిష్ఠ, దృష్టి కుంభం, మహాబలి, పూర్ణహుతి యాగశాల విశేష పూజలు చేశారు. ఆలయ పూజారులు, భక్తులు. మహిళలు పాల్గొన్నారు.

ఎంపీడీఓ ఆఫీస్‌లో అన్నీ ఖాళీలే!

- ఇబ్బందులకు గురవుతున్న మండల ప్రజలు
- ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ఉద్యోగులతో పాటు స్థానికుల డిమాండ్



తరిగొప్పుల మండల పరిషత్ కార్యాలయం

తరిగొప్పుల : మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది కొరత ఇటు మండల ప్రజలను.. అటు కార్యాలయం అధికారులను వేధిస్తోంది. సరిపడా సిబ్బంది లేకపోవడంతో సకాలంలో పనులు జరగక కార్యాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండల పరిషత్ పరిధిలో 15 గ్రామ పంచాయతీలు ఉండగా ఆయా గ్రామాల ప్రజలు తమ పనుల కోసం మండల పరిషత్ కార్యాలయానికి వస్తే సిబ్బంది కొరతతో సకాలంలో పనులు కావడం లేదని వాపోతున్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్, అటెండర్ (ఆఫీస్ సబార్డినేట్), పీఆర్ ఏఈ పోస్టులు ఖాళీగా ఉండడంతో కార్యాలయ నిర్వహణ సైతం కష్టంగా మారిందని మండల పరిషత్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి త్వరతిగతినా ఖాళీగా ఉన్న సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్, అటెండర్, పీఆర్ ఏఈల పోస్టులను భర్తీ చేయాలని మండల ప్రజలు, కార్యాలయ అధికారులు కోరుతున్నారు.

పనుల నిర్వహణ ఆలస్యమవుతోంది



కార్యాలయంలో సరిపడా సిబ్బంది లేకపోవడం ప్రభుత్వ పథకాలు అమలు, అభివృద్ధి పనుల నిర్వహణ ఆలస్యమవుతోంది. కార్యాలయంలో విధుల నిర్వహణ, క్షేత్రస్థాయి పరిశీలనతో ఉన్న కొద్ది మంది ఉద్యోగులపై పనిభారం పడుతోంది. కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు పనులు చేయడంలో జాప్యం జరుగుతోంది. - ఆలేటి దేవేందర్‌రెడ్డి

పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ



ఇళ్ల వద్ద మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

రఘునాథపల్లి : మండలంలోని కంచనపల్లి గ్రామంలో ఆదివారం సీపీఐ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో 30 మంది ఇళ్లు లేని పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కావటి యాదగిరి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం గ్రామంలో ఇళ్లులేని పేదలను గుర్తించి 30 డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించారే తప్ప వాటిని పంచలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ పేదలను గుర్తించి ఇళ్లను పంపిణీ చేయకపోవడం సమంజసం కాదన్నారు. ఇటీవల గ్రామంలో ఇళ్లు లేని పేదల జాబితాను అధికారులకు ఇచ్చినా పట్టించుకోలేదని అందుకే తాము ముందుండి పంపిణీ చేయడం జరిగిందన్నారు. అధికారులు స్పందించి విద్యుత్, నీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్లేశం, దానీలు, వెంకటయ్య, మహేందర్, అశోక్, ఏశోబు, సీమోను, సందీప్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

నరేష్‌కు దళితరత్న పురస్కారం



జనగామ రూరల్ : తెలంగాణ అవతరణ దినోత్సవ అన్యువల్ అవార్డ్స్‌లో భాగంగా ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వల్లూరి నరేష్ దళితరత్న అవార్డును అందుకున్నాడు. హైదరాబాద్‌లో జరిగిన సభలో డాక్టర్ బాబూమోహన్ ఫిల్మ్ ఆర్టిస్టుల చేతుల మీదుగా నరేష్ అవార్డు అందుకున్నాడు. కొడకండ్ల మండలం రంగాపురం గ్రామానికి చెందిన వల్లూరి నరేష్ కొన్ని సంవత్సరాలుగా సామాజిక సేవలు నిర్వహిస్తుండడంతో గుర్తించి అవార్డు అందజేసినట్లు తెలిపారు.

యేసుపాదంకు..

దేవరుప్పుల : మండలంలోని కడవెండికి చెందిన పడమటింటి యేసుపాదంకు వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో దళితరత్న అవార్డు లభించింది. సామాజిక ఉద్యమంతోపాటు అనేక సేవలందించినందుకుగాను దళితరత్న అవార్డు అందుకున్నారు.

మారిన ట్రాన్స్‌కో ఆఫీసర్ల ఫోన్ నంబర్లు

బచ్చన్నపేట : మండలంలోని పలు సబ్ స్టేషన్లు, అక్కడ విధులు నిర్వర్తిస్తున్న అధికారుల ఫోన్ నంబర్లు మారినట్లు వినియోగదారులు గమనించాలని ట్రాన్స్‌కో ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఏఈ మాట్లాడుతూ.. బచ్చన్నపేట–87124 82869, ఆలింపూర్–87124 82870, లక్ష్మాపూర్–87124 82871, నారాయణపురం–87124 82872, 87124 82745 (సబ్ ఇంజనీర్), 87124 82722(ఏఈ), 87124 82700 (అకౌంట్ ఆఫీసర్), 87124 82693(ఏడీఈ) నంబర్లు అందుబాటులో ఉంటాయన్నారు. బచ్చన్నపేట సబ్ స్టేషన్ పరిధిలో ఎద్దుగూడెం, చిన్నరామన్‌చర్ల, తమ్మడపల్లి, పోచన్నపేట, ఆలింపూర్ పరిధిలో సోలామైల్, కట్కూర్, గంగాపూర్, లక్ష్మాపూర్ పరిధిలో కొడవటూర్, బండనాగారం, కేసిరెడ్డిపల్లి, బసిరెడ్డిపల్లి, బోనకొల్లూర్, నారాయణపురం పరిధిలో కాశీనగర్, సదాశివపేట గ్రామాలు ఉంటాయని ఏఈ పేర్కొన్నారు.



మ్యాన్‌హోల్‌లో ఇరుక్కున్న ఆటో

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

జనగామ పట్టణంలోని సూర్యాపేట రోడ్డు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సమీపంలో మ్యాన్‌హోల్‌లో ఓ ఆటో ఇరుక్కు పోయింది. రోడ్డు పక్కన ఉన్న మ్యాన్‌హోళ్లతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై స్థానిక మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. - జనగామ

గిరి ప్రదక్షిణకు తరలిన జనగామ భక్తులు



యాదగిరిగుట్టలో జనగామ భక్తులు

జనగామ : స్వాతి నక్షత్రం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట గిరి ప్రదక్షిణకు జనగామ నుంచి వందలాది మంది భక్తులు ఆదివారం తరలివెళ్లారు. తెల్లవారుజామున 4:30 గంటలకు జిల్లా కేంద్రం నుంచి భారీ ర్యాలీగా గుట్టకు బయలుదేరారు. గుట్టచుట్టూ ప్రదక్షిణ చేసి, మెట్లగుండా కొండపైకి ఎక్కి స్వామిని దర్శించుకున్నారు. భక్తులు ధర్మపురి శ్రీనివాస్, చింతకింది మల్లేశం, అంజనేయులు, కొండ శ్రీనివాస్, వేముల శంకర్, చెంచారపు బుచ్చిరెడ్డి, ఉడుగులు నర్సింహులు, కందుకూరి శ్రీనివాస్, మారం ప్రవీణ్, చంద్రయ్య, పెండెండ జ్ఞానేశ్వర్, వేముల వెంకటేశ్వర్లు, రమేష్, కైలాసం, శివరామక్రిష్ణ, కె.శ్రీనివాస్, శ్రీమన్నారాయణ తదితరులు ఉన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఒకే పాఠశాల నుంచి 8మంది..



అశ్వీత



నిహారిక



లాస్య



చిత్ర



వైశాలి



ప్రీతి



కార్తీక్



సుశాంత్

చిల్పూరు: పల్లగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదివిన 8 మంది విద్యార్థులు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికై నట్లు హెచ్‌ఎం పెనుమాటి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 4 నెలల పాటు విద్యార్థులకు.. ఉపాధ్యాయులతో ప్రత్యేక శిక్షణ ఇప్పించడంతోనే జిల్లాలోనే మొదటి సారిగా ఒకే పాఠశాల నుంచి 8 మంది విద్యార్థులు ఎంపిక కావడం హర్షనీయమన్నారు. అందుకు ఉపాధ్యాయుల కృషి అభినందనీయమన్నారు. ఎంపికైన విద్యార్థులను ఎంఈఓ దాసరి గోవర్ధన్, చిల్పూరు ఆలయ చైర్మన్ శ్రీధర్‌రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు తదితరులు అభినందించారు.

రాణు నాయక్ పోరాటాన్ని స్ఫూర్తిగా చూపాలి

- బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సభావత్ రాములు



రాములు నాయక్‌కు పూలబొకే ఇస్తున్న రాణు నాయక్ చిత్రం డైరెక్టర్ ఖాసీం తదితరులు

దేవరుప్పుల : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో జాటోత్ రాణు నాయక్ ప్రదర్శించిన పోరాట ఘట్టాలను భావితరాలకు స్ఫూర్తిగా నిలిపేలా సినిమా చిత్రీకరించాలని మాజీ ఎమ్మెల్సీ, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సభావత్ రాములు నాయక్ సూచించారు. పోరాట యోధుడు జాటోత్ రాణునాయక్ పేరిట లఘు చిత్రం తీస్తున్న సీతారాంపురం గ్రామానికి చెందిన యూనిట్ డైరెక్టర్ ఎండీ ఖాసీం ఆదివారం మర్యాద పూర్వకంగా ఆయనను కలిశారు. ఈ సందర్భంగా లంబాడీ జాతి ఆత్మగౌరవం కోసం దేశ్‌ముఖ్‌లకు వ్యతిరేకంగా పోరాటి ఆనాడే తుపాకీ తూటాలకు నేలకొరిగిన రాణునాయక్ జీవిత చరిత్రను సినిమా తీసేందుకు తన వంతు సహకారాలు అందిస్తామన్నారు.కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర నాయకులు దశరథ్ నాయక్, యూనిట్ బృందం సభ్యులు రాజేష్,సింగర్ ఎస్.మంజుల, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి



పాలకుర్తి టౌన్: శాతాపురంలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు



కొడకండ్లలో..

కొడకండ్ల : అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేయాలని హెచ్‌ఎం దోర్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఆదివారం మండలకేంద్రంలో ఉపాధ్యాయులంతా ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పిల్లలను ప్రభుత్వ పాఠశాల ల్లోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమేష్, వేణు, కవిత, వెంకటయ్య, కొక్కుల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

పాలకుర్తి టౌన్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని తొర్రూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెనుగొండ రమేష్ అన్నారు. ఆదివారం మండలంలోని శాతాపురం గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో చదువుతోపాటు విద్యార్థులకు వివిధ క్రీడలు, పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసున్నట్లు వివరించారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫాం అందిస్తున్నట్లు చెప్పారు. ప్రైవేట్ పాఠశాలలకు పంపకుండా స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గోనె మైసిరెడ్డి, మాజీ సర్పంచ్ పసులాది వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుల పేరుతో ఇటుక బట్టీలకు..

- వాల్టా చట్టానికి వ్యతిరేకంగా టిప్పర్లు, లారీల్లో చెరువు మట్టి తరలింపు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వీకేసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనంద్

పాలకుర్తి టౌన్ : చెరువు శిఖం భూముల్లో రైతులకు మట్టి తవ్వుకునేందుకు అనుమతి తీసుకుని..వాల్టా చట్టానికి వ్యతిరేకంగా అక్రమంగా ఇటుక బట్టీలకు టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్న వారిపై చర్య తీసుకోవాలని విముక్తి చిరుతల కచ్చి (వీకేసీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చెరిపల్లి ఆనంద్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ..అక్రమంగా చెరువు మట్టి తరలింపుపై వరంగల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కాట్రపల్లి పెద్ద చెరువు నుంచి రోజుకు 400 టిప్పర్లు, లారీల ద్వారా జనగామ జిల్లా పాలకుర్తి మండలం మీదుగా కొడకండ్ల మండలం లక్ష్మక్కపల్లి గ్రామానికి ఇటుక బట్టీల కోసం తరలిస్తున్నారని వివరించారు. అక్రమ మట్టి తరలింపుపై రాయపర్తి తహసీల్దార్‌కు, ఇరిగేషన్ ఏఈకి సమాచారం ఇవ్వగా చెరువు శిఖం భూముల్లో రైతులకు మట్టి తీసుకునేందుకు అనుమతి ఇచ్చినట్లు చెబుతున్నారని తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా రోజుకు 400 లారీల మట్టిని ఓ రాజకీయ నాయకుడు తరలిస్తున్నాడని ఆరోపించారు. కోట్లాది రూపాయల వ్యయంతో ప్రజా రవాణాకు నిర్మించిన రోడ్లపై మట్టి లారీలతో సామాన్య ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు.



ఇటుక బట్టీల వద్ద నిల్వ చేసిన చెరువు మట్టి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బచ్చన్నపేట: ఇటుకాలపల్లిలో 2006-07 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు



రఘునాథపల్లి: సమ్మేళనంలో పాల్గొన్న 1986-87 బ్యాచ్ విద్యార్థులు

బచ్చన్నపేట : మండలంలోని ఇటుకాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006–07 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. తమ పాతజ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో సన్మానించారు.

రఘునాథపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో

రఘునాథపల్లి : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో 1986–87 సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సురేందర్, భాస్కర్, నాగేష్, వీరస్వామి, బాలరాజు, ఎల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, రవీందర్, శ్రావణ్ పాల్గొన్నారు.

శివునిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..



స్టేషన్‌ఘన్‌పూర్: ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 2000-01 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

స్టేషన్‌ఘన్‌పూర్ : శివునిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2000–01 సంవత్సరంలో పదో తరగతి చదివిన బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు పూర్వ విద్యార్థులు కలుసుకుని సిల్వర్ జూబ్లీ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు శ్యామ్, విజయ్, ఇంద్రసేనారెడ్డి, రాజు, సత్యం, రంజిత్, రాజేష్, నరేష్,కమలాకర్, యాసిస్, రఘు, హరి,గోపి, శ్రీధర్,రాము, ఉపాధ్యాయులు నేషనల్ అవార్డు గ్రహీత డాక్టర్ రాజ్‌మహ్మద్, హెచ్‌ఎం సంత్‌కుమార్, రమేష్, స్వర్ణలత, పురుషోత్తం, వాణిదేవితో పాటు తదితరులు పాల్గొన్నారు.

సంస్మరణ సభను జయప్రదం చేయండి

- సీపీఎం పట్టణ కార్యదర్శి ప్రకాశ్

జనగామ రూరల్ : గంగసాని రఘుపాల్ సంస్మరణ సభను జయప్రదం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ఏసీరెడ్డి నగర్, గిర్నిగడ్డ, ధర్మకంచ, సంజయ్ నగర్ ప్రాంతాల్లో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈనెల 10న ఓ ఫంక్షన్ హాల్‌లో సంస్మరణ సభ జరుగుతుందని అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. తెలంగాణలో భూమి, భుక్తి , వెట్టిచాకిరి విముక్తికి వ్యతిరేకంగా నిజాం రజాకార్ల ఆగడాలకు ఎదురించిన పోరాటాల్లో ముఖ్య పోషించారన్నారు. సభకు ముఖ్య అతిథులుగా జూలకంటి రంగారెడ్డి, నూడి కృష్ణారెడ్డి హాజరవుతున్నారన్నారు. పట్టణ కమిటీ సభ్యులు ఎండీ అజారుద్దీన్, కళ్యాణం లింగం, పల్లెర్ల లలిత, బొట్ల శ్రావణ్, బూడిది ప్రశాంత్, శాఖ కార్యదర్శులు గుండె మల్లేష్, బూడిద అంజమ్మ, ఎండీ గౌసియా నాజియా, అబ్రహం లింకన్, ఆది పోశయ్య, బాలమణి, లక్ష్మి, రేణుక, తిమోతి, సుధాకర్, రమాదేవి, భాస్కర్ పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం



స్టేషన్‌ఘన్‌పూర్: ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న చైర్ పర్సన్ లావణ్య



బచ్చన్నపేట: పూజలో పాల్గొన్న బాల్‌రెడ్డి



చిల్పూరు: పల్లగుట్టలో..

స్టేషన్‌ఘన్‌పూర్ : కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనతోనే పేదల సొంతింటి కల సాకారం అయిందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జూలుకుంట్ల లావణ్య అన్నారు. రంగరాయగూడెంతో పాటు సముద్రాల గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు గ్రామానికి 29 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా 25 ఇళ్లకు ముగ్గులు పోసి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శిరీష్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్వరరెడ్డి, లలితాదేవి, వెంకటమ్మ, విమలనర్సయ్య, కుమారస్వామి, భాస్కుల కిరణ్, తోట వెంకన్న, అనూష తదితరులు పాల్గొన్నారు.

చిల్పూరు : సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమైందని చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు అన్నారు. పల్లగుట్ట గ్రామంలో ఆదివారం నూతనంగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్లు లేని పేదలందరికీ ఇళ్లు మంజూరవుతాయన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సురేష్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, ఇసురం కృష్ణ, నాయకులు దారరాజు, రత్నాకర్‌రెడ్డి, పేరాల సుధాకర్, జీడి ఆనందం,అశోక్ పాల్ వెంకటేశ్వర్లు, నరసింహారెడ్డి, రమ, యేసు, రజిత తదితరులు పాల్గొన్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్: రంగరాయగూడెంలో..

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

బచ్చన్నపేట: నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోసి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని వాటి నిర్మాణాలను కూడా లబ్ధిదారులు త్వరలోనే చేపడుతారని అన్నారు. అర్హత గల ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు నీల రమేష్, జంగిడి సిద్దులు, రమేష్, అఖిల్ మాల, లబ్ధిదారులు అల్వాల నర్సింగారావు, రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.